# పేకమేడ

ధర్మారావుని మేమంతా ధర్మరాజనే పిలుస్తాం. కారణం లేక పోలేదు. పేక ముక్కల్ని చూస్తే ప్రపంచాన్నే మరచి పోయేవాడు. పోనీ తెలివిగా ఆడి ఏ నాడైనా సంపాదించాడా అంటే అదీ లేదు. ఎంతో తెలివైనవాడిననుకునే శుద్ధ అమాయకుడు, నష్టజాతకుడు. ఈ మధ్య వాళ్ళ ఊరు వెళ్ళినప్పుడు ఏదో కాలనీలో అద్దెకుంటున్నాడు. "దగ్గరగా ఏదైనా పోస్టాఫీసు ఉందా? ఉత్తరం పోస్టుచేసి వస్తాను" అన్నాను. "అదిగో ఈ వీధి చివరనే ఒక పేక మేడ ఉంది. దాని వెనకాలనే పోస్టాఫీసు ఉంది" అన్నాడు. అలా వెళ్ళి వస్తూ పేక మేడ అని ఎందుకు పేరు పెట్టి ఉంటారా అని నిశితంగా అటు చూశాను. ఏదో గట్టిగా ఊదితే కూలిపోయే అల్లాటప్ప మేడకాదు. ముందు వేపు ఇస్పేట్ ఆసుడిజైన్ వేసి అధునాతనంగా కట్టిన కాంక్రీట్ మేడ. ఆమేడ గురించి ధర్మారావు దగ్గర ప్రస్తావిస్తే, "అదో చిత్రమైన కథలే; అది కట్టుకున్న దంపతులు ఇద్దరూ ఇద్దరే. ఎన్నెన్నో కాలనీలలో అద్దెకు ఉంటూ వచ్చి చివరకు పేకాటలో గెల్చిన సొమ్ముతో ఈ మేడ కట్టుకున్నారని అందరూ అంటారు. ప్రతీ కాలనీలోనూ నాలాంటి పిచ్చివాళ్ళని

రెచ్చగొట్టి పేకాట పిచ్చిలోపడేసి సర్వమంగళం పాడించేసేవారు" అన్నాడు నీరసంగా ఈర్ష్యపడుతున్న ధోరణిలో.

'అయితే మాత్రం ! ఎప్పుడూ వాళ్ళేగెలవడం అసంభవం కదా" అన్నాను. ఊరుకోలేక. "మన ఊరు రాజుగారు లేరు ? ఆయనా ఆయన భార్యా పిల్లలూ అంతా తలోపార్టీ టిక్కట్టు మీదా ఎన్నికల్లో నిలబడేవారు. ఏ ఒక్కరు గెల్చినా అధికార పక్షంలోనో, పలుకుబడి రాజకీయ బలం ఉన్న ఏ ప్రతి పక్షంలోనో సర్దుకుని కూర్చునేవారు. ఉమ్మడి ఆస్తుల్ని పెంచుకోవడమో, కనీసం పన్నుల బరువుకి కరిగి పోకుండా రక్షించుకోవడమో చేసేవారు. వీళ్ళ వ్యవహారమూ అంతే" అన్నాడు.

నాకు ఎందుకనో ఆ సమాధానం తృప్తికలిగించలేదు. తర్కానికి నిలబడదనితోచింది. ఊరుకోలేదు నేను. "వాళ్ళతో ఆడేవాళ్ళు కుడా ఒకే కుటుంబ సభ్యులు అడితే వాళ్ళు కాదనలేరుగా" అన్నాను. ఆ పేక మేడ చూశాక ఆ దంపతులకు అనుకూలించే ప్రబలమైన కారణం ఏదో ఉండి ఉంటుందనిపించింది. "వాళ్ళు ఏం ఉద్యోగంచేసేవారు ?" అని అడిగాను. "ఏమో" అన్నాడు ధర్మరాజు. ఉరఫ్ ధర్మారావ్. ధర్మారావు పెద్దకూతురు మా సంభాషణ ఒక చెవితో వింటున్నట్లుంది.

"చాలా కాలాం వాళ్ళు ఇద్దరూ నేత్రావధానం చేస్తూ దేశమంతా తిరిగారు. వాళ్ళ ఇంట్లో ఎన్నో మెమెంటోలూ, షీల్డ్‌లూ ఉన్నాయి" అంది నా ప్రశ్నకు జవాబుగా. ధర్మారావు కన్నా లౌకికజ్ఞానం అతని పిల్లతరానికి ఎక్కువ ఉన్నందుకు కాస్త తృప్తి కలిగింది.